క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలు అందించాలి


మాట్లాడుతున్న సురేఖ

బెల్లంపల్లిరూరల్: రైతులకు డీలర్లు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించాలని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ అధికారి సురేఖ అన్నారు. మండలంలోని కన్నాల రైతువేదికలో బెల్లంపల్లి డివిజన్ పరిధిలో డీలర్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యత కలిగిన విత్తనాలను రైతులకు అందించాల్సిన బాధ్యత డీలర్లదేనని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరకే విక్రయించాలన్నారు. వ్యవసాయ అధికారులు ప్రేమ్‌కుమార్, వందన, కిరణ్మయి, ఏఈవోలు పాల్గొన్నారు.

రక్షణ పరికరాలు పంపిణీ


సిబ్బందికి పరికరాలు అందిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

బెల్లంపల్లి: మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పారిశుధ్య సిబ్బందికి చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, కమిషనర్ వెంకటేశ్వర్లు, పలువురు కౌన్సిలర్లు శుక్రవారం రక్షణ పరికరాలు పంపిణీ చేశారు. అంతకుముందు శానిటేషన్ సిబ్బందికి వైద్యశిబిరం నిర్వహించి పరీక్షించి మందులు అందజేశారు. డాక్టర్లు సుచరిత, సౌజన్య, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, ఏఈ సందీప్, టీవో అశ్రిత్, కౌన్సిలర్ కొమ్ముల సురేశ్ పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం


అవగాహన కల్పిస్తున్న అధికారులు

చెన్నూర్: పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరాంలాల్‌గిల్డా, కమిషనర్ గంగాధర్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాలతో పట్టణంలోని 1, 2 వార్డుల్లో సీజనల్ వ్యాధులపై శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. అనంతరం మురుగుకాల్వల్లో ఆయిల్ బాల్స్ వేశారు. కౌన్సిలర్లు సతీశ్, శ్రీనివాస్, మెడికల్ ఆఫీసర్ జగదీశ్‌దోబా, ఏఈ సాయికిరణ్, ఆశవర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అశోక్ కుమార్

దండేపల్లి: తెలంగాణ గ్రామీణ బ్యాంకు దండేపల్లి బ్రాంచి ఆధ్వర్యంలో స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆర్థిక అక్షరాస్యతపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నాబార్డ్ కౌన్సిలర్ అశోక్ కుమార్ మాట్లాడారు. బ్యాంకు లావాదేవీలు, పంట రుణాలు, వ్యాపార రుణాలు, బంగారు ఆభరణాలపై ఇచ్చే రుణాలతోపాటు, బీమా పథకాల గురించి వివరించారు. డబ్బును ఎలా పొదుపు చేసుకోవాలో అనే అంశాలను తెలియజేశారు. బ్యాంకు మేనేజర్ అనిల్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ చంద్రకాంత్, సిబ్బంది స్వామి, సతీశ్ పాల్గొన్నారు.

రాముని చెరువు కాపాడాలని నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న వెంకటయ్య

మంచిర్యాల టౌన్: పట్టణంలోని రాముని చెరువును అక్రమార్కుల నుంచి కాపాడాలని కోరుతూ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య శుక్రవారం కట్టపై ప్లకార్డు పట్టుకుని, నల్లబ్యాడ్జీతో వినూత్న నిరసన తెలిపారు. చెరువులో దుర్గంధపూరిత వాసన వెదజల్లుతున్న మురుగునీటిని, పేరుకుపోయిన పూడిక మట్టిని తొలగించాలని డిమాండ్ చేశారు.

పందుల స్వైరవిహారం

- వీధులు, గల్లీల్లో గుంపులుగా సంచారం
- జనావాసాల్లోకి చొరబడుతున్న వైనం
- భయపడుతున్న మహిళలు, చిన్నారులు


కాల్‌టెక్స్ ఏరియాలోని ఓ వీధిలో పందులు

బెల్లంపల్లి: బెల్లంపల్లి బల్దియాలో పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. కొన్నినెలలుగా వీటి బెడద సద్దుమణగా ఇటీవల కాలంలో గుంపులుగా సంచారం చేస్తుండటంతో పురప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. పట్టణంలో 34 వార్డులు ఉన్నాయి. వార్డుల వారీగా యాజమానులు పందుల పెంపకం చేస్తున్నారు. ఇళ్ల పరిసరాలు, క్వార్టర్లకు దూరంగా 2 కి.మీ దూరంలో పెంపకం చేపట్టాలనే నిబంధనలున్నా సరిగా అమలు కావడం లేదు. గల్లీల్లో పందులు విచ్చలవిడిగా తిరుగుతుండటం, ఇళ్లలోకి గుంపులుగా చొరబడుతున్నాయి. దీంతో మహిళలు, చిన్నారులు, వృద్ధులు భయపడుతున్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించడం ముఖ్యం. మురుగుకాల్వల్లో వరదనీరు నిల్వ లేకుండా, చెత్తాచెదారం పేరుకుపోకుండా చూడటం, తాగునీటి పైపులైన్ లీకేజీ కాకుండా జాగ్రత్తలు పాటించాలి. ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా, శునకాలు, పందుల బెడద నివారణకు మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోవల్సి ఉంది. కానీ అధికారులు సరిగా స్పందించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. వర్షాకాలం ఆరంభమై నెలరోజులు దాటినా ఇప్పటి వరకు చర్యలు తీసుకున్నా పాపానపోలేదు.

చిన్నారులకు మెదడువాపు!

పందులకు వచ్చే అనారోగ్య సమస్యలతో చిన్నారులకు మెదడువాపు వ్యాధి వచ్చే అవకాశాలున్నాయని వైద్యులు సూచిస్తున్నారు. జనానివాసాల్లో పందుల కట్టడికి చర్యలు తీసుకోకపోవడంతో పురప్రజలు ఆందోళన చెందుతున్నారు. యజమానులకు ఆదేశాలు జారీ చేయడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల అవతల సర్వే నెంబర్ 170లో ఉన్న ఐదెకరాల ప్రభుత్వ భూమిని పందుల పెంపకం కోసం గతంలో కేటాయించారు. ఆ స్థలంలో పెంపకం చేపట్టకపోవడంతో మున్సిపాలిటీలో వీటి బెడద తీవ్రంగా ఉంది. ఇక చెత్తాచెదారం రోజులవారీగా ఎక్కడపడితే అక్కడ పేరుకుపోయి ఉంటోంది. దుర్వాసన వస్తుండటంతోపాటు ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటివల్ల విషజ్వరాలు ఇతర వ్యాధులు వచ్చే అవకాశాలు పొంచి ఉన్నాయి. అధికారులు, చైర్‌పర్సన్, కౌన్సిలర్లు పట్టించుకుని ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టిసారించి చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తాం

ఇళ్ల పరిసరాల్లో పందుల పెంపకం చేపట్టకుండా యజమానులకు సమావేశం నిర్వహించి అవగాహన కల్పిస్తాం. బస్తీల్లో సంచారం చేయకుండా కట్టడి చర్యలు తీసుకుంటాం. యజమానులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటాం.

– వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్


మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

తాండూర్: నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ కుమారస్వామి తెలిపారు. మండలంలోని మాదారం త్రీ ఇంక్‌లైన్ గ్రామంలో శుక్రవారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. పోలీసులు ఇంటింటా సోదాలు చేశారు. ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేసి సరైన పత్రాలు లేని వాహనాలు సీజ్ చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత పోలీసులపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకారం అందించాలని కోరారు. అనుమానితులు సంచరిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. యువకులు మత్తు పదార్థాలకు బానిసకావొద్దన్నారు. ఎస్సై కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు


వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న సీఐ

చెన్నూర్: మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రవీందర్ అన్నారు. రామగుండం సీపీ శ్రీనివాస్ ఆదేశాలతో గురువారం రాత్రి నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 35 వాహనాలు పట్టుకున్న విషయం తెలిసిందే. శుక్రవారం వాహనాదారులకు పోలీసుస్టేషన్‌లో సీఐ అవగాహన కల్పించారు. వాహనాలకు సంబంధించిన అన్ని పత్రాలు తమవెంట తెచ్చుకోవాలన్నారు. వాహనాలకు గతంలో విధించిన జరిమానాలకు మీ సేవ కేంద్రాల్లో చెల్లించాలని సూచించారు. నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్సైలు, వాహన యాజమానులు పాల్గొన్నారు.

'కొక్కిరాల'కు మంత్రి పదవి రావాలని పూజలు


పూజల్లో కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావుకు మంత్రి పదవి రావాలని హాజీపూర్ మండలం రాపల్లిలోని లక్ష్మీగణపతి ఆలయంలో కాంగ్రెస్ మండల నాయకులు శుక్రవారం పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభం వద్ద కొబ్బరికాయ కొట్టారు. నాయకులు పూస్కూరి శ్రీనివాసరావు, గోనె సతీశ్‌రావు, దొమ్మటి సత్తయ్య, పూదరి శంకరయ్య, అన్నం మధుసూదన్ రెడ్డి, జితేందర్‌రావు, కుటుంబరావు, మల్యాల రాజ్‌కుమార్, చింతపండు తిరుపతి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేదు


మాట్లాడుతున్న హరీశ్‌చంద్రారెడ్డి

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో విద్యుత్ సరఫరాకు ఇబ్బంది లేదని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ హరీశ్ చంద్రారెడ్డి అన్నారు. జీజీహెచ్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 3న విద్యుత్ సరఫరాకు కొంత ఇబ్బంది జరిగినా, అదేరోజు అర్ధరాత్రి పునరుద్ధరించామన్నారు. ఎంసీహెచ్‌కు విద్యుత్ సరఫరా చేసే మెయిన్ వైరు కాలిపోవడంతో ఇబ్బంది అయిందని తెలిపారు. ఏ ఆస్పత్రికైనా ఒకే కనెక్షన్ ఇవ్వకుండా, మరో రెండు డమ్మీ కనెక్షన్లు ఇస్తారన్నారు. కానీ ఎంసీహెచ్ నిర్మాణం చేసినప్పుడు ఒకటే కనెక్షన్ ఇచ్చారని తెలిపారు. రెండేళ్ల క్రితం ఎంసీహెచ్ వరద నీటికి మునిగి పోవడంవల్ల, విద్యుత్ సరఫరా కోసం అండర్‌గ్రౌండ్ నుంచి వేసిన వైరు తడిచి పాడైందన్నారు. వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటులో ఆలస్యం వల్ల సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. కేవలం మూడు గంటల పాటు సరఫరా లేదన్నారు. ఎంసీహెచ్‌కు విద్యుత్ అంతరాయం లేకుండా శాశ్వత చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్ కుమార్, ఎంసీహెచ్ ఆర్ఎంవో భీష్మ, జీజీహెచ్ ఆర్ఎంవో శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

రుణాలు మంజూరు చేయాలి

బెల్లంపల్లి: బీసీలకు కార్పొరేషన్ రుణాలు మంజూరు చేయాలని బెల్లంపల్లికి చెందిన పద్మశాలి సంఘం ప్రతినిధి శ్రీనివాస్ కోరారు. జిల్లా బీసీసంక్షేమ శాఖ అధికారికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. 2014 నుంచిరుణాలు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయించాలన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

మందమర్రిరూరల్: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో 7,8,9 తరగతి చదువుతున్న విద్యార్థినులకు శుక్రవారం ఆరోగ్యం పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గర్ల్ చైల్డ్ ఎంపవర్‌మెంట్ క్లబ్ (జీసీఈసీ) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రభుత్వ వైద్యాధికారి రమేశ్ హాజరై పలు సూచనలు చేశారు. ఎలాంటి ఆహార నియమాలు పాటించాలో అనే అంశంతోపాటు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గురించి వివరించారు. ప్రిన్సిపాల్ జయకృష్ణారెడ్డి, జీసీఈసీ ఇన్‌చార్జి సుష్మామాధురి ఉన్నారు.

బాధితుడికి ఆర్థికసాయం

మందమర్రిరూరల్: గత నెలలో ఏరియాలోని ఎంవీటీసీలో శిక్షణ తరగతి నుంచి ఇంటికి వచ్చే క్రమంలో రోడ్డు ప్రమాదంలో ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు తోట తిరుపతి గాయపడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి అటు నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లి వైద్యం చేయించారు. మానవతా దృక్పథంతో తోటి సెక్యూరిటీ గార్డులు వైద్య ఖర్చుల కోసం సేకరించిన రూ.1,04,500 నగదును శుక్రవారం ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ నగునూరి రవి బాధితుడికి అందించారు. సెక్యూరిటీ సిబ్బంది ఉన్నారు.

చిర్రకుంటలో కళాజాత

మందమర్రిరూరల్: మండలంలోని చిర్రకుంటలో పోలీస్ కళాబృందం ఆధ్వర్యంలో శుక్రవారం కళాజాత నిర్వహించారు. దురాచారాలు, నేరాలపై కళ్లకు కట్టినట్లు కళా ప్రదర్శన రూపంలో చూపించారు. సీఐ శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై మల్లేశం పాల్గొన్నారు.

ఎంసెట్‌లో ర్యాంకు రాలేదని ఆత్మహత్య


శ్రీజ (ఫైల్)

చెన్నూర్‌రూరల్: ఎంసెట్‌లో ర్యాంకు రాలేదని విద్యార్థిని ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. చెన్నూర్ మండలంలో ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని దుగ్నెపల్లికి చెందిన వీరబోయిన ఐలయ్య, లక్ష్మి దంపతులకు ముగ్గురు కుమార్తెలు. వీరిది నిరుపేద కుటుంబం. రెండో కూతురు శ్రీజ (19) ఇంటర్ పూర్తిచేసి ఎంసెట్ రాసింది. సరైన ర్యాంకు రాకపోవడంతో మనోవేదనకు గురైంది. ఈక్రమంలో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గేదెలు కట్టేయకుండా చూడాలి

మంచిర్యాలటౌన్: పట్టణంలోని 18వ వార్డులో ఓవర్ బ్రిడ్జి కింద గేదెలు కట్టేయకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ మారుతిప్రసాద్‌కు వార్డు ప్రజలు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతంవాడ రైల్వేట్రాక్ వద్ద, భగవంతంవాడ రోడ్డునంబర్ 2 వద్ద రెండు ప్రదేశాల్లో గేదెలు కట్టేసి రోజుల తరబడి ఉంచడం వల్ల ఆ ప్రాంతంలో దుర్వాసన వస్తుందన్నారు. ఈగలు, దోమలతో ఆ ప్రాంతంలోని ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలే కాలం కావడంతో వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తాజ్, మొగిలి గౌడ్, కిరణ్, సతీశ్, స్వామి పాల్గొన్నారు.

సన్మానం

బెల్లంపల్లి: పట్టణానికి చెందిన బిలాల్ పవిత్రమైన హజ్ యాత్రను విజయవంతంగా ముగించుకుని ఇంటికి వచ్చిన సందర్భంగా బీఆర్‌ఎస్ ముస్లిం మైనార్టీ విభాగం నాయకులు శుక్రవారం ఆయన్ను సన్మానించారు. పట్టణ ఉపాధ్యక్షుడు అధ్యక్షుడు అలీ, ప్రధాన కార్యదర్శి ఖలీం, కార్యదర్శి ఖలీల్, ఎంపీపీ కోఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా పాల్గొన్నారు.

నంబర్ ప్లేట్ లేకుంటే చర్యలు

శ్రీరాంపూర్: వాహనాల నంబర్ ప్లేట్ సరిగ్గా లేకుంటే చర్యలు తీసుకుంటామని శ్రీరాంపూర్ ఎస్సై సంతోశ్ తెలిపారు. శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌లో వాహనదారులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఆర్టీఏ నిబంధనల ప్రకారం నంబరు ప్లేట్లు ఉండాలన్నారు. పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలు చేయాలి

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలం అడ్డుకోవాలంటే ఐక్య ఉద్యమాలు చేయాలని తెలంగాణ సింగరేణి ఉద్యోగుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీరటి రాజన్న, ఉపాధ్యక్షుడు దేవి సత్యం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సంఘాలు కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

ఎంపీ, ఎమ్మెల్యేను కలిసిన సభ్యులు


సన్మానిస్తున్న సభ్యులు

మంచిర్యాలక్రైం: కాగజ్‌నగర్‌లోని జీవన ధార వాలంటరీ బ్లడ్ బ్యాంకు క్యాంప్ ఆహ్వానం మేరకు ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబును మంచిర్యాల బార్ అసోసియేషన్ సభ్యులు శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యేకు శాలువాలు కప్పి సన్మానించారు. అధ్యక్షుడు జగన్, అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్ ప్రదీప్ చంద్ర సోమ, రమణారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతగా మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న జీఎం సంజీవరెడ్డి


మొక్క నాటుతున్న మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్

శ్రీరాంపూర్: ప్రతి ఒక్కరూ తమవంతు బాధ్యతగా కనీసం మూడు మొక్కలు నాటాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. వన మహోత్సవంలో భాగంగా ఆర్కే 7 ఏజెంట్ కార్యాలయంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా వారి నివాస ప్రదేశాల్లో మొక్కలు నాటాలన్నారు. ఇతరులకు బహుమతులు ఇచ్చే సమయంలో మొక్కలు అందించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఓటూజీఎం ఏవి రెడ్డి, అధికారుల సంఘం వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజెంట్ రాముడు, మేనేజర్ శ్రీధర్, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు, కొట్టే కిషన్‌రావు, ఫిట్ సెక్రెటరీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

జన్నారం: ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని తాజా మాజీ జెడ్పీటీసీ చంద్రశేఖర్ అన్నారు. జన్నారం అటవీ డివిజన్‌లోని జన్నారం రేంజ్‌లో మొక్కలు నాటారు. ఫారెస్ట్ రేంజ్ అధికారులు హఫీజొద్దీన్, సుష్మారావు, మాజీ ఎంపీటీసీలు రియాజొద్దీన్, స్వరూపరాణి, మాజీ ఎంపీపీ మచ్చ శంకరయ్య, ఏపీవో రవీందర్, డీఆర్వో తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కుర్మగూడంలో నీటి కష్టాలు


నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

వేమనపల్లి: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న కుర్మగూడంలో తాగునీటికి గ్రామస్తులు నానా తంటాలు పడుతున్నారు. గ్రామంలో మొత్తం 44 కుటుంబాలు ఉండగా , మూడు తాగునీటి బోర్లు ఉన్నాయి. ఒక బోరు గతంలో చెడిపోగా, మరో బోరు నుంచి పూర్తిగా మురుగునీరు వస్తున్నాయి. మరో బోరుకు మోటారు అమర్చి గ్రామానికి నీటి అవసరాలు తీరుస్తున్నారు. అది చెడిపోయి నెల రోజులు కావస్తున్నా, మరమ్మతు చేయించే వారు లేరు. గతంలో మోటారు, స్టార్టర్ చెడిపోయినప్పుడల్లా ఇంటికి రూ.200 చందాలు వేసుకొని మరమ్మతు చేయించుకున్నామని గ్రామస్తులు తెలుపుతున్నారు. తాగునీరు లేకపోవడంతో అర కిలోమీటర్ దూరంలో రాజారాం పంచాయతీకి వెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు తెలుపుతున్నారు. మిషన్ భగీరథ నీరు సక్రమంగా రావడం లేదని గ్రామస్తులు తెలుపుతున్నారు. ఈ విషయమై గ్రామ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినా గ్రామపంచాయతీ నిర్వహణకే నిధులు రావడం లేదని, మోటార్లు రిపేర్ ఎలా చేయించాలని తెలుపుతున్నారు.

కవితల పోటీల విజేతలకు బహుమతులు


బహుమతి అందుకున్న విద్యార్థులతో డీఈవో

మంచిర్యాలఅర్బన్: స్థానిక సైన్స్ సెంటర్‌లో తెలంగాణ ఎన్‌జీసీ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జూన్ 29న నిర్వహించిన జిల్లా స్థాయి పోస్టర్ మేకింగ్, కవితల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు డీఈవో యాదయ్య శుక్రవారం బహుమతులు ప్రదానం చేశారు. పోస్టర్ మేకింగ్‌లో దేవాపూర్ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన ప్రీతికుమార్ ప్రథమ, వెంకట్రావ్‌పేట్ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన శ్రావ్య ద్వితీయ, తీగలపహాడ్ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన దివ్య తృతీయ స్థానంలో నిలిచారు. కవిత పోటీల్లో వెంకట్రావ్‌పేట్ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన హాసిని ప్రథమ, ఆదర్శ పాఠశాల మంచిర్యాలకు చెందిన సాహిత్య ద్వితీయ, దొనబండ జెడ్పీఎస్ఎస్‌కు చెందిన సాయి స్పందన తృతీయ స్థానంలో నిలిచారు. వీరికి డీఈవో ప్రశంసాపత్రం, డిక్షనరీ, నగదు పారితోషికం అందజేశారు. ఈ కార్యక్రమంలో సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, డీఎస్‌వో మధుబాబు, డీసీఈబీ అసిస్టెంట్ కుమారస్వామి పాల్గొన్నారు.

ఆన్‌లైన్ నామినేషన్స్‌పై అవగాహన

మంచిర్యాలఅర్బన్: ఇన్‌స్పైర్ అవార్డ్స్ ఆన్‌లైన్ నామినేషన్లపై ఈ నెల 6న టీశాట్(నిపుణ చానల్) ద్వారా ఉదయం 11గంటల నుంచి 12 గంటల వరకు అవగాహన కార్యక్రమం ఉంటుందని డీఈవో యాదయ్య తెలిపారు. 6నుంచి 10వ తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు వీక్షించేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. భౌతిక, జీవశాస్త్ర, గణిత ఉపాధ్యాయులు పాల్గొనాలని పేర్కొన్నారు.

విద్యార్థి సంఘాల నాయకుల అరెస్టు


జన్నారం: పోలీస్‌స్టేషన్‌లో నాయకులు


చెన్నూర్: దీక్షను విరమింపజేస్తున్న నాయకులు

జన్నారం: టీజీపీఎస్సీ ముట్టడిలో భాగంగా మండలంలో బీజేవైఎం, విద్యార్థి సంఘాలను పోలీసులు శుక్రవారం ముందస్తుగా అరెస్టు చేశారు. బీజేవైఎం అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్, నేతకాని విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రసాద్ నేత, ఇతర నాయకులు చంద్రశేఖర్, పవన్, నితిన్, మనీశ్‌ను అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మధ్యాహ్నం వారిని సొంత పూచీకత్తుపై వదిలేశారు. అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని ప్రసాద్ నేత పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగులకు జాబ్ కేలండర్ విడుదల చేసి, ఉద్యోగ నియామకాలు చేపట్టాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అల్లూరి విజయ్ డిమాండ్ చేశారు.

చెన్నూర్: పట్టణానికి చెందిన బీజేవైఎం, బీఆర్ఎస్వీ నాయకులను పోలీసులు గురువారం రాత్రి ముందస్తు అరెస్ట్ చేశారు. నిరుద్యోగులకు మద్దతుగా బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివకృష్ణ, నాయకులు తుమ్మ శ్రీపాల్, చిరంజీవి శుక్రవారం స్టేషన్ ఎదుట నిరసన దీక్ష చేపట్టారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్‌లు స్టేషన్‌కు వెళ్లి వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. నాయకులు బత్తుల సమ్మయ్య, కాశెట్టి నాగేశ్వర్ రావు, గర్రెపల్లి నర్సయ్య, రాపర్తి వెంకటేశ్వర్, మానికరౌతు శంకర్ పాల్గొన్నారు.

తాండూర్: మండలానికి చెందిన పలువురు బీజేపీ అనుబంధ సంఘాల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రదీప్, మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు విఘ్నేష్, బాలకృష్ణ, సతీశ్, కార్యదర్శి నరేశ్‌ను పోలీసులు అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తర్వాత సొంతపూచీకత్తుపై వదిలేశారు.

లక్సెట్టిపేట: నిరుద్యోగ సమస్యలపై బీజేవైఎం ఆధ్వర్యంలో కలెక్టర్ ముట్టడికి వెళ్తుండగా నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. నాయకులు సిద్ధార్థ, హేమంత్, లకావత్ ఈశ్వర్ ఉన్నారు.

బెల్లంపల్లి: బీజేపీ అనుబంధ సంఘాల శ్రేణులను ముందస్తు అరెస్టు చేశారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్‌కుమార్ ఇంటికి వెళ్లి పోలీసులు అదుపులో తీసుకుని వన్‌టౌన్‌కు తీసుకువచ్చారు. విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం సరైందికాదని పేర్కొన్నారు.

మందమర్రిరూరల్: బీజేవైఎం నాయకులు శ్రీనివాస్, బీఆర్ఎస్ యూత్ పట్టణ అధ్యక్షుడు భట్టు రాజ్‌కుమార్, టీజేఎస్వీ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ అభిరామ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్ తరలించారు.

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్‌లో పలువురు విద్యార్థి సంఘాల నేతలను ముందస్తు అరెస్టు చేశారు. రాగిడి రాజు, సన్నిగౌడ్, జాగిరి రాజేశ్‌ను గురువారం రాత్రి అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు